బస్టాండ్ లేదు సుమా..!

- బస్సు కోసం వేచిచూస్తే ఆశాభంగమే
- పేరుకే ఆర్టీసీ ప్రధాన బస్టాండ్
- ఏళ్లుగా నిరుపయోగం
- ఛిద్రమైన ఆవరణ
- నిర్లక్ష్యం నీడలో ఏడిద రోడ్డు బస్ స్టేషన్



నిరుపయోగంగా మారిన ఏడిద రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్

కపిలేశ్వరపురం: బంధువుల ఇంటికి బస్సెక్కి పోవాలనుకుంటాం... సాధ్యమైనంత సమీపంలో బస్సు ఆగాలని కోరుకుంటాం. మారిన జీవన పరిస్థితుల్లో ప్రజలు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని ఆశిస్తున్నారు. నలుదిక్కులా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు పలు మార్గాలకు బస్సులను నడపాలి. అలా నడిచే బస్సులు ఓ చోటకు చేరువవ్వాలి. బస్సు కోసం వేచి చూసే చోట కాస్తంత ఛాయ్ తాగాలని చూస్తాం. ఇలాంటి ప్రయాణ సౌకర్య ప్రదేశమే బస్టాండ్. మండపేట పట్టణం ప్రధాన రహదారిలోని ఆర్టీసీ బస్టాండ్ ఇరుకుగా ఉన్న నేపథ్యంలో గతంలో పట్టణంలోని ఏడిద రోడ్డులో బస్టాండ్ నిర్మించారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ బస్టాండ్ 19 ఏళ్లుగా నిరుపయోగంగా మారింది.

పట్టణ ప్రాధాన్యత ఇదీ..

మండపేట, అనపర్తి, కొత్తపేట, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గాల ప్రజలకు మండపేట పట్టణం ప్రధాన కేంద్రంగా ఉంది. దానికి తోడు పౌల్ట్రీ, రైస్‌మిల్లులు, ఇతర పరిశ్రమలకు కేంద్రంగా మండపేట పట్టణం వర్ధిల్లుతోంది. ఈ నేపథ్యంలో పట్టణానికి వచ్చి పోయే జనం, వాహనాలు దానికి తగినట్టే ఉంటాయి. దీర్ఘకాలంగా మండపేట మెయిన్ రోడ్డులోని బస్ షెల్టర్ మీదుగానే ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగుతూ వచ్చాయి. కాలక్రమంలో పట్టణానికి రద్దీ మరింత తీవ్రమైంది.

నిలిచేందుకు నీడ లేదు

మండపేట పట్టణం నడిబొడ్డున జొన్నాడ–కాకినాడ ప్రధాన రహదారిలో ప్రస్తుతం బస్టాండ్ నిర్వహణలో ఉంది. రావులపాలెం నుంచి కాకినాడ, సామర్లకోట వెళ్లే బస్సులు, సామర్లకోట, కాకినాడ నుంచి రావులపాలెం, విజయవాడ వైపునకు వెళ్లే బస్సులు వచ్చిన రూటులోనే యథేచ్ఛగా రాకపోకలు సాగించే వీలుంది. రామచంద్రపురం– రాజమహేంద్రవరం రాకపోకలు సాగించే బస్సులు బస్టాండ్ వద్ద మలుపు తిరిగి బస్ట్ షెల్టర్‌లోకి వెళ్లాల్సి వస్తుంది. ఆ క్రమంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. బస్‌షెల్టర్ సైతం చిన్నది కావడంతో ప్రయాణికులు రోడ్డుపైనే నిలుచుని బస్సుల కోసం వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. రావులపాలెం వైపునకు వెళ్లే ప్రయాణికులకు షెల్టర్ సదుపాయం లేదు. ఎండ, వానల్లోనే బస్సుకోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

లక్షల ప్రజాధనం వృథా

పట్టణ ప్రధాన రహదారిలోని బస్టాండ్ ఇరుకుగా ఉండటంతో పట్టణంలోని ఏడిద రోడ్డులో రెండెకరాల విస్తీర్ణంలో సుమారు రూ.20 లక్షల వ్యయంతో వేగుళ్ల సూర్యారావు బస్ స్టేషన్ నిర్మించారు. 1999 ఏప్రిల్ 4న అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. 2005 ఆగస్టు 22న దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బస్ స్టేషన్‌ను ప్రారంభించారు. అప్పటి రోజుల్లో కొత్తగా నిర్మించిన ఏడిదరోడ్డు బస్టాండ్ మీదుగానే ఆర్టీసీ బస్సు సర్వీసులను నడిపారు. పట్టణ ప్రధాన రహదారులకు ఓ మూల ఏడిద రోడ్డు బస్టాండ్ నిర్మించడంతో ప్రయాణికులకు సమస్యగా మారింది. బస్సుల కోసం స్టాండ్‌కు వెళ్లేందుకు నానా అవస్థలు పడేవారు. కొంత కాలానికి ఆర్టీసీ అధికారులు ఏడిదరోడ్డులోని బస్టాండ్ వైపునకు సర్వీసులను రద్దు చేసి ప్రధాన రహదారిలోని బస్టాండ్ మీదుగా వాహనాలను మళ్లించారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల కోరికపై కొంతకాలం రాజమహేంద్రవరం వైపునకు వెళ్లే బస్సులను ఏడిద రోడ్డు బస్టాండ్ మీదుగా నడిపారు. తర్వాత కాలంలో మొత్తం సర్వీసులను రద్దు చేశారు. సుమారు 19 ఏళ్లుగా ఏడిదరోడ్డు బస్టాండ్ నిరుపయోగంగా ఉంది. ఇన్నేళ్ల కాలంలో పట్టణ విస్తీర్ణం, ప్రయాణికుల రాకపోకలు, రద్దీ విపరీతంగా పెరిగింది. విలువైన స్థలంలో రూ.లక్షలు పోసి నిర్మించిన బస్ షెల్టర్‌ను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

వినియోగంలోకి తేవాలి



నియోజకవర్గ కేంద్రం మండపేటకు వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు చేసేవారి సంఖ్య బాగా పెరిగింది. ఇంతటి ప్రాధాన్యమున్న పట్టణంలో ఏడిద రోడ్డులోని ప్రధాన బస్టాండ్ నిరుపయోగంగా మారడం బాధాకరం.రాజమహేంద్రవరం, కాకినాడ వంటి నగరాలకు వెళ్లే మార్గంలో ఉన్న మండపేటపై పాలకులు దృష్టి సారించాలి. బస్టాండ్‌ను తిరిగి వినియోగంలోకి తేవాలి.

– యరమాటి వెంకన్నబాబు, మండపేట.

మార్చి 12న ఫీజు పోరు



సూర్యప్రకాశ్

రామచంద్రపురం: విద్యార్థులకు వెంటనే ఫీజు రియింబర్స్‌మెంట్ ఇవ్వాలని కోరుతూ ఈ నెల 5న తలపెట్టిన ఫీజు పోరు కార్యక్రమాన్ని మార్చి నెల 12కు వాయిదా వేసినట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ మంగళవారం స్థానిక మీడియాకు వెల్లడించారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయం మేరకు వాయిదా వేయటం జరిగిందన్నారు. పార్టీ శ్రేణులు మార్చి నెల 12న అమలాపురం జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి



మట్టి ఫలితాల నమూనా పత్రాలను రైతులకు అందిస్తున్న ఏడీఏ రంగారావు

కె.గంగవరం: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడితే మంచి ఫలితం ఉంటుందని రామచంద్రపురం ఏడీఏ రంగారావు అన్నారు. మండల పరిధిలోని కుడుపూరు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ గత తొలుకరిలో సేకరించిన మట్టి నమూనా పరీక్షలను పరిశీలించిన పిదప వచ్చిన ఫలితాలను రైతులకు అందజేయడం జరిగిందన్నారు. ఈ ఫలితాలు ఆధారంగానే రైతులు దాళ్వా వరిసాగు ఎరువులు వాడాలని సూచించారు. వ్యవసాయ అధికారుల సూచనలను కాకుండా విచ్చల విడిగా ఎరువులు వాడితే రైతులు నష్టపోతారని తెలిపారు. ఈ నెల 6వ తేదీన అన్ని గ్రామాల్లో రైతు సేవాకేంద్రాల ద్వారా ఎలుకల మందు పంపిణీ చేయడం జరుగుతుందని ఆ మందును రైతులంతా సామూహికంగా వాడి ఎలుకలను నియంత్రించాలని కోరారు. సర్పంచ్ పిల్లి రాంబాబు, ఏఓ బలుసు రవి, స్థానిక రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు



వడ్లమూరులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

కపిలేశ్వరపురం: వ్యవసాయ సాగులో ఆధునిక పద్ధతులపై ప్రతి రైతుకు అవగాహన ఉండాలని, దీనిద్వారా అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశముందని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. వడ్లమూరు రైతు సేవా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్థానిక సాగు పరిస్థితులను ఆలమూరు వ్యవసాయ సహాయ సంచాలకులు కె.నాగేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ వివరించారు. బోసుబాబు మాట్లాడుతూ వరి పంటను ఆశించే పురుగులు, తెగుళ్లు, వాటి లక్షణాలు, నియంత్రణా పద్ధతులపై అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్‌పీఎస్ఎస్ యాప్‌ను నిర్వహిస్తుందన్నారు. యాప్ నిర్వహణ, అందులోని అంశాలపై బోసుబాబు రైతులకు అవగాహన కల్పించారు. ఈనెల 6న నిర్వహించే సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని రైతులు శాస్త్రీయ పద్ధతిలో చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు బి.ప్రియాంక, చుండ్రు వీర వెంకట్రావు చౌదరి, పుచ్చకాయల రామారావు, పుట్టా వెంకన్నబాబు పాల్గొన్నారు.

బాల కార్మికుల గుర్తింపునకు ప్రత్యేక డ్రైవ్



ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న అధికారులు

రాయవరం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో బాల కార్మికులను గుర్తించడానికి పలు శాఖలు ప్రత్యేక డ్రైవ్‌ను మంగళవారం నిర్వహించాయి. కార్మికశాఖ, పోలీస్, విద్యాశాఖ, ఐసీడీఎస్, ఎన్‌జీవో సంస్థలు కలిసి టీమ్‌గా ఏర్పడి ఈ ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. మండపేట అసిస్టెంట్ లేబరు అధికారి శివ నాగమల్లేశ్వరరావు సారథ్యంలో మండలంలోని గ్రామాల్లో పలు వ్యాపార సంస్థలు, హోటళ్లు, రైస్ మిల్లులు, ఇటుక బట్టీ పరిశ్రమల్లో పని చేస్తున్న బాల కార్మికులను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. 18 సంవత్సరాల లోపు బాల, బాలికలను పనిలో పెట్టుకోవద్దని పలు సంస్థల యాజమాన్యాలకు అధికారులు హెచ్చరించారు. బాల కార్మికులను పనికి అనుమతిస్తే బాల కార్మిక చట్టం ప్రకారం జైలుశిక్ష, జరిమానాకు బాధ్యులవుతారని హెచ్చరించారు.

మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన నాయకులు

మండపేట: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శాసన మండలి సభ్యుడు తోట త్రిమూర్తులు అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై వైఎస్ జగన్ తోట త్రిమూర్తులతో కాసేపు చర్చించారు. నియోజకవర్గ పరిస్థితిని తోట వివరించారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుపై ప్రజల అసంతృప్తిని తెలియజేశారు. మండపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శిరిపురపు శ్రీనివాస్ కుమారుల వివాహ ఆహ్వాన పత్రికను అందించి జగన్‌ను ఆహ్వానించారు. శ్రీను బంధువులు, సాధనాల శివ పాల్గొన్నారు.

రైతు బజారును సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ విశాలాక్షి



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖ ఏడీ విశాలాక్షి

రాయవరం: రైతులు వారు పండించిన ఉత్పత్తులను నేరుగా విక్రయించు కునేందుకు ఏర్పాటు చేసిన రైతు బజారును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ కె.విశాలాక్షి పేర్కొన్నారు. రాయవరంలో మంగళవారం స్థానిక రైతు బజారు వద్ద గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో ఏడీ విశాలాక్షి మాట్లాడుతూ రైతులకు మేలు కలిగేలా చర్యలు తీసుకోవడంలో భాగంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. రైతులు పండించుకున్న పంటలు నేరుగా రైతు బజార్లకు తెచ్చుకుని విక్రయించు కోవచ్చన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించడానికి రైతు బజార్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని రామచంద్రపురం ఉద్యానవన శాఖ అధికారిణి ఎం.అనూష తెలిపారు. ప్రజలకు తక్కువ ధరలో కూరగాయలు అందించడానికి రైతు బజార్లు ఉపయోగపడతాయన్నారు. రాయవరంలో రైతు బజారును పునరుద్ధరించడానికి రైతులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ ఎస్ఎంసీ చైర్మన్ దేవిశెట్టి చిన్ని, ఉద్యానవన శాఖ సహాయకులు భువనేశ్వరి(కె.గంగవరం), సత్యవేణి (మండపేట), కె.ఐశ్వర్యదేవి (రాయవరం), ద్వారపూడి మార్కెటింగ్ కమిటీ సెక్రటరీ పి.సుబ్బరాజు, మండపేట రైతు బజారు ఎస్టేట్ ఆఫీసర్ బి.సతీష్ కుమార్, మార్కెటింగ్ కమిటీ సిబ్బంది, కూరగాయలు పండించే రైతులు, వ్యాపారులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై అలసత్వం వద్దు

- మున్సిపాలిటీల అభివృద్ధికి సమన్వయంతో సాగాలి
- మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ నరసింహారావు



కమిషనర్లకు ఆదేశాలిస్తున్న మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ నరసింహారావు

మండపేట: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని మున్సిపాలిటీలను అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు మున్సిపల్ కార్యాలయాల్లోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ కం అప్పిలేట్ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు అన్నారు. మంగళవారం ఆయన మండపేట మున్సిపాలిటీని సందర్శించి కార్యాలయంలోని అన్ని విభాగాలను పరిశీలించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లాలోని మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అమలాపురం, రామచంద్రపురం, కొవ్వూరు, నిడదవోలు, ముమ్మిడివరం, మండపేట మున్సిపల్ కమిషనర్లు, అన్ని విభాగాల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నరసింహారావు పురపాలక సంఘాల వారీగా అధికారులను ప్రశ్నించారు. మున్సిపల్ పరిపాలనా తీరుపై ఆరా తీశారు. వివిధ అభివృద్ధి అంశాలపై చర్చించారు. రెవెన్యూ, శానిటేషన్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు సమయపాలన పాటించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యం విషయంలో అలసత్వం ప్రదర్శించరాదన్నారు. దోమల మందు పిచికారీ చేసి దోమల బెడద లేకుండా చూడాలన్నారు. డ్రెయిన్లలో మురుగునీరు నిల్వ లేకుండా శుభ్రం చేయాలన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రణాళికాబద్ధంగా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులకు పలు ఆదేశాలు చేశారు. పట్టణాల్లో అనధికార భవన నిర్మాణాలు, లేఔట్‌ల నిర్మాణాలపై ఆయన ఆరా తీశారు. సమావేశంలో కమిషనర్లు టీవీ రంగారావు, ఐకేపీ నాయుడు, పీ రవివర్మ, టీఎల్‌పీఎస్ఎస్ కృష్ణవేణి, నాగేంద్రకుమార్, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వాహనాలను బాధ్యతగా నడపాలి



కె.గంగవరంలో డ్రైవింగ్ పత్రాల పరిశీలన



రోడ్డు ప్రమాదాలపై తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై మోహన్ కుమార్

కె.గంగవరం: ఆటో డ్రైవర్లు బాధ్యతాయుతంగా వాహనాలను నడపాలని కె.గంగవరం ఎస్సై జానీ బాషా సూచించారు. మండల పరిధిలోని కె.గంగవరంలో మంగళవారం ఆటో యూనియన్ సభ్యులతో రోడ్డు భద్రతపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లంతా తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. ఆటోలకు సంబంధించిన పత్రాల తప్పనిసరిగా ఉండాలని, నిబంధనల ప్రకారం వాహనాలు కండిషన్‌లో ఉండాలన్నారు. పరిమితికి మించి ఎక్కించుకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలను స్కూళ్లకు తీసుకువెళ్లే ఆటో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడప కూడదని సూచించారు. అనంతరం ఆటోలకు సంబంధించిన పత్రాలు, డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్సులు పరిశీలించారు.

మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు

కాజులూరు: మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని గొల్లపాలెం ఎస్సై ఎం మోహన్‌కుమార్ అన్నారు. మంగళవారం గొల్లపాలెం–కుయ్యేరు రహదారిలో చేదువాడ జంక్షన్ వద్ద నాకాబంది నిర్వహించి ప్రయాణికులు రోడ్డుపై వెళ్లే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించటం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపటం వలనే ఇటీవల ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుతున్నాయన్నారు. అనంతరం సైబర్ నేరాలు, సీసీ కెమేరాల ఏర్పాట్లపై వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు.

సామూహిక ఎలుకల నిర్మూలనను విజయవంతం చేయాలి

రాయవరం: ఎలుకలను పూర్తిగా నిర్మూలన చేయాలంటే రైతులంగా సామూహికంగా ఎలుకల నిర్మూలన ప్రక్రియను చేపట్టాలని, అందుకు ముందుగా రైతుల్లో అవగాహన కల్పించాలని మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో మంగళవారం మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకులకు సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఏవో ప్రభాకర్ మాట్లాడుతూ రబీకి మండలంలో 14,500 ఎకరాల్లో వరి పంట సాగు చేయడం జరిగిందన్నారు. వరి పంట ప్రస్తుతం పిలక దశలో ఉందని, ఎలుకల బారి నుంచి పంటను సంరక్షించుకోవడానికి రైతులు అనేక విధాలుగా ప్రయత్నం చేస్తున్నారన్నారు. అందులో భాగంగా వ్యవసాయ శాఖ ద్వారా సరఫరా చేస్తున్న బ్రోమోడయలిన్ మందుతో సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలన్నారు. ఈ నెల 6న ఉదయం 9గంటల నుంచి అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఎలుకల మందును పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో వ్యవసాయ విస్తరణాధికారి శివశంకర్, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.పది వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు కానూరుకు చెందిన చోడపనీడి శ్రీరామ్, లక్ష్మీచాముండేశ్వరి దంపతులు రూ.10,116 విరాళంగా అందించారు. విరాళం అందించిన దాత కుటుంబానికి ఆలయ అర్చకులు గొడవర్తి శ్రీనివాస్ స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. రథసప్తమి సందర్భంగా మంగళవారం విశేష సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.61,457 ఆదాయం వచ్చింది. 1500 మంది స్వామిని దర్శించుకున్నారు. 700 మంది స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారు. లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.6,465 ఆదాయం వచ్చింది. నిత్యాన్నదాన ట్రస్టుకు భక్తులు రూ.16,795 అందించారని ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు.

భాస్కరా.. శుభకరా..

- గ్రామాల్లో రథసప్తమి పూజలు
- ఆలయాలకు భక్తుల తాకిడి

కపిలేశ్వరపురం: మండల పరిధిలోని 19 గ్రామాల్లో మంగళవారం రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వైష్ణవాలయాల్లో భక్తులు దేవతా మూర్తులను దర్శించుకున్నారు. మహిళలు ఉదయానే పుణ్యస్నానాలు ఆచరించి ఇంటిలో భాస్కరుడికి పూజలు చేశారు. చిక్కుడు కాయలు, కొబ్బరి ఈనెలతో తయారు చేసిన రథానికి చిక్కుడు ఆకులు, రేగు పండ్లు, జిల్లేడు పూలను అలంకరించి పూజించారు. ఆవు పిడకల దాలిపై ఆవుపాలు పొంగించి క్షీరాన్నం వండి నైవేద్యంగా సమర్పించారు. అంగర, కపిలేశ్వరపురం, వెదురుమూడి, తాతపూడి, టేకి, కోరుమిల్లి, వల్లూరు తదితర గ్రామాల్లోని ఆలయాలను భక్తులు పెద్ద సంఖ్యలో సందర్శించారు.

కాజులూరు: మండల పరిధిలో గల గ్రామాలలో మంగళవారం రథసప్తమి పూజా కార్యక్రమాలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. రథసప్తమి రోజు నుంచే వేసవి ప్రారంభమవుతుందని హైందవ భక్తుల విశ్వాసం. ఈ రథసప్తమి రోజున సూర్య భగవానుడు కొత్త రథాలను సిద్ధం చేసుకుని తన పయనాన్ని ప్రారంభిస్తాడని భక్తుల నమ్మకం. అందుకే ఈ రోజు ఆరు బయట తులసి కోట వద్ద సూర్యభగవానుని చిత్రపటాన్ని ఉంచి పండ్లు, ఫలహారాలు నైవేద్యంగా పెట్టి ఆయనకు పూజలు నిర్వహిస్తారు. చిక్కుడు కాయలతో చేసిన రథాన్ని మండపం చుట్టూ తిప్పుతారు. మండలంలోని అన్ని గ్రామాలలోనూ మహిళలు రథసప్తమి పూజా కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. అనంతరం సమీప ఆలయాలకు వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన

కొత్తపేట: ఆహార నియమాలు పాటిస్తూ మంచి పౌష్టికాహారం తీసుకుంటే ఏ ఒక్కరూ క్యాన్సర్ బారిన పడకుండా ఉంటారని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు క్యాన్సర్ అవగాహన సదస్సు నిర్వహించారు. జువాలజీ విభాగం ఆధ్వర్యంలో శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన నిర్వహించిన కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ క్యాన్సర్‌ను తెలుగులో 'కర్క రోగం' అని అంటారని తెలిపారు. మనిషి శరీరంలో కణాల పెరుగుదలలో నియంత్రణ లేక చాలా వేగంగా అస్తవ్యస్తంగా విభజన చెంది కణ సమూహాలను ఏర్పరుస్తాయని, వాటినే 'కణతి' (ట్యూమర్) అంటారని తెలిపారు. సమావేశంలో జువాలజీ అధ్యాపకులు బి.విజయకుమార్, పి.ప్రసన్నజ్యోతి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. క్యాన్సర్ డే సందర్భంగా స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు అవగాహన క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు.

ఆలమూరులో..

ఆలమూరు: ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించడంతో పాటు దురలవాట్లకు దూరంగా ఉంటే క్యాన్సర్‌ను సమూలంగా నయం చేయవచ్చని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, డి.సాయికిషోర్ అన్నారు. మండలంలోని ఆయా పీహెచ్‌సీల్లో మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం జరిగింది. వైద్య ఆరోగ్య ఆశ సిబ్బంది వివిధ గ్రామాల్లోని పుర వీధుల్లో క్యాన్సర్ నివారణకు తీసుకోవసిలన జాగ్రత్తలను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. ఆహారపు అలవాట్లు మార్చుకోండి– క్యాన్సర్ మహమ్మారిని తరిమి కొట్టండి అంటూ నినాదాలు చేశారు. శరీరంలో ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే సత్వరమే వైద్య పరీక్షలు నిర్వహించుకుని వ్యాధి నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

మహాకుంభ మేళా- అయోధ్య బస్సు ప్రారంభం



రామంచంద్రపురం డిపో నుంచి మహాకుంభ మేళా బస్సును ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం ఆర్టీసీ డిపో నుంచి మహాకుంభ మేళా–అయోధ్య యాత్ర ప్రత్యేక బస్సును జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి ఎం. శ్రీనివాసరావు మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రావులపాలెం డిపో మేనేజర్ జీవీ రమణ, సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె. రవికుమార్, గ్యారేజీ ఇన్‌చార్జ్ జి.రవిబాబు, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది, మహాకుంభ మేళా యాత్రికులు పాల్గొన్నారు.

బాషాకు సూర్యప్రకాశ్ పరామర్శ



బాషాను పరామర్శిస్తున్న సూర్యప్రకాశ్

రామచంద్రపురం: ఈ నెల 3వ తేదీన పట్టణంలోని 9వ వార్డుకు చెందిన వైఎస్ఆర్ సీపీ నేత జుత్తుక గులాం బాషా రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యారు. పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ బాషా ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈయన వెంట కౌన్సిలర్ కోటి శ్రీకన్య దుర్గాప్రసాద్, తాళ్లపాలెం సర్పంచ్ కటా గోవిందు, పలువురు కార్యకర్తలు ఉన్నారు.

విజ్ఞానదాయక ప్రాజెక్టులతో అవగాహన



విద్యార్థులకు సైన్స్ ప్రాజెక్టులను వివరిస్తున్న బీవీసీ కళాశాల ఇంజినీరింగ్ విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: కోనసీమలోని బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు మంగళవారం ద్రాక్షారామ జెడ్పీ హైస్కూలు వేదికగా కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు కింద రెండు ప్రాజెక్టులను విజయవంతంగా నిర్వహించారు. దీనిలో భాగంగా టీం లీడ్ చోడిశెట్టి జ్యోతి ప్రకాశ్ నేతృత్వంలోని ఒక బృందం 'విజ్ఞానాన్ని పెంపొందించడం' అనే ప్రాజెక్టు, పెద్దిశెట్టి అశోక్ తేజ నేతృత్వంలోని మరో బృందం 'విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపు' అనే ప్రాజెక్టును నిర్వహించి జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 450 మంది విద్యార్థులకు మోటారు వాహనాల మెకానిజం, నిర్వహణ, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలు, విపత్తు నిర్వహణ, అగ్ని ప్రమాదల సమయంలో తీసుకోవాల్సినన జాగ్రత్తలు, ఫైర్ సేఫ్టీ పరికరాలు ఉపయోగించే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గైడ్ టీచర్లు గిడ్డి వెంకటేశ్వరరావు, గోసాంగి నరసరాజు, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వాడ్రేవు రత్న పద్మావతి, ఒకేషనల్ టీచర్లు రెడ్డి కనకరాజు, శేఖర్, అరవ విస్సు, జిల్లా సైన్స్ ఆఫీసర్ గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, చోడిశెట్టి శివాజీ, కర్రా తాతేలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

కాజులూరు: కాజులూరు శివారు శ్రీరామ్‌నగర్ కాలనీలోని తాటాకిల్లుకు నిప్పంటుకుని కొత్తూరి రాజేశ్వరి అనే వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ గ్రామంలో సోమవారం రాత్రి 10 గంటల సమయంలో విద్యుత్ సరఫరా పోయింది. దీంతో రాజేశ్వరి కొవ్వొత్తును వెలిగించబోయి తన చీరకు నిప్పంటించుకుంది. ఆ మంటలు పెరిగి తాటాకింటికి అంటుకున్నాయి. స్థానికులు గమనించి వెంటనే మంటలు అదుపు చేశారు. గాయాలపాలైన రాజేశ్వరిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు.

బంగారు గొలుసు చోరీ

రామచంద్రపురం: అద్దెకు ఇల్లు కావాలని వచ్చి, బంగారు గొలుసును దొంగిలించుకుపోయిన ఘటన మంగళవారం పట్టణంలోని గణేష్ నగర్‌లో జరిగింది. గణేష్ నగర్‌కు చెందిన కడియాల పార్వతి తన ఇంటిని అద్దెకు ఇచ్చేందుకు టూలెట్ బోర్డు పెట్టారు. ఒక యువకుడు వచ్చి ఇల్లు అద్దెకు కావాలని నమ్మబలికి ఇంటిని చూపించమన్నాడు. దీంతో పార్వతి ఖాళీగా ఉన్న పోర్షన్ తాళాలు తెరచి ఇంటిలోని గదులను చూపించింది. చివరగా కిచెన్‌లోకి వెళ్లే సరికి పార్వతి మెడలోని రూ.2.40 లక్షల విలువ చేసే 4 కాసుల బంగారం గొలుసు లాక్కుని పారిపోయాడు. షాక్ గురైన పార్వతిని స్థానికులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ సీఐ వెంకటనారాయణ, ఎస్సై నాగేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని పార్వతిని విచారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

అయినవిల్లి: కొట్లాట కేసులో ఇరువర్గాలపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.మనోహరజోషి తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం తొత్తరమూడికి చెందిన నేదునూరి సుమంత్, లోకేసు, ఉదయ్‌లు మోటార్‌సైకిల్ పై ముక్తేశ్వరంలో ఉన్న వంట ఇల్లులో కూరలు పార్శిల్ చేయించుకునేందుకు వెళుతున్నారు. ఈ సమయంలో విలస గ్రామానికి చెందిన కూటం జనార్దన్ అనే వ్యక్తి వారి వెనుక మోటార్‌సైకిల్‌పై వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో వీరి మధ్య వివాదమైంది. ఇది మాటా మాటా పెరిగి ఇరువర్గాలు కొట్టుకున్నారు. ఈ కొట్లాటలో వీరికి గాయాలయ్యాయి. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.